

పొరుగున్న ఏపీలోలా ఇక్కడి ప్రభుత్వం ఆర్థికసాయాన్ని పెంచి ఇవ్వాలని బుధవారం చెన్నైవళ్లువర్‌కోట్టం వద్ద ఆందోళన చేస్తున్న దివ్యాంగులు

అణగారిన వర్గాలకు పథకాలు చేరడం లేదు

పుదుచ్చేరి ఎల్జీ కైలాష్‌నాథన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు అణగారిన వర్గాలకు పూర్తిగా వెళ్లి చేరడం లేదని పుదుచ్చేరి ఎల్జీ కైలాష్ నాథన్ తెలిపారు. ఆది ద్రావిడర్ బిజినెస్ అండ్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ తరపున పుదుచ్చేరి ఎస్సీ, ఎస్టీ ఎకనమిక్ లిబరేషన్ సదస్సు బుధవారం జరిగింది. ఎల్జీ కైలాష్‌నాథన్ అంబేద్కర్ చిత్రపటానికి పువ్వులు చల్లి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు నేడు విద్య, పరిశోధన రంగాల్లో ప్రపంచానికి నాయకత్వం వహిస్తున్నారని చెప్పారు. చదువు ఫలితంగానే ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత పదవులను




ప్రసంగిస్తున్న కైలాష్‌నాథన్

అలంకరిస్తున్నారని పేర్కొన్నారు. ఏ సమాజమైనా ఆర్థికంగా బలంగా ఉన్నప్పుడే సుస్థిర అభివృద్ధి దిశగా పయనించగలుగుతుందన్నారు. ఆర్థికంగా బలంగా ఉండాలంటే పరిశ్రమలు అందులో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయన్నారు. పారిశ్రామికరంగంలో అగ్రగామిగా మారినప్పుడే వారు ఉన్న సమాజం అభివృద్ధి చెందుతుందని వివరించారు.

ఈనాడు తమిళనాడు

గురువారం అక్టోబరు 24, 2024 5



పునర్విభజన పోరాటమేనా?

జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలు తగ్గే అవకాశం

పిల్లల్ని ఎక్కువ కనాలంటూ సీఎం సంకేతం

జాతీయ సగటుకన్నా తక్కువ జననాలు

లోక్‌సభ స్థానాల పునర్విభజన జరగబోతోందనే ప్రచారం విస్తృతంగా నడుస్తోంది. ఈ నేపథ్యంలో జనాభా పెరుగుదలపై పెద్ద చర్చ నడుస్తోంది. ఇంత కాలం జనాభాను నియంత్రించాలనే నినాదం వెంట రాష్ట్రం పరిగెత్తింది. ఇప్పుడు ఎంత ఎక్కువ జనాభా ఉంటే అన్నేసి లోక్‌సభ స్థానాలన్నట్లు వాదనలు నడుస్తున్న నేపథ్యంలో తాజాగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాజకీయ చర్చకు దారితీశాయి.

ఈనాడు-చెన్నై

16 మందిని కనొచ్చుకదా!



లోక్‌సభ నియోజకవర్గాలను తగ్గించొచ్చు అంటున్నారు. అలాంటప్పుడు సంతానాన్ని ఎందుకు పరిమితం చేసుకోవాలి? మనం కూడా 16 మందిని కనొచ్చుకదా అనే భావన ప్రజల్లో వస్తుంది. పరిమిత సంతాన భావనతో ఉన్న ప్రజలు ఆలోచన చేసే పరిస్థితి రావొచ్చు. చిన్న కుటుంబం యోచన మానుకోవచ్చు. ఏదేమైనా పుట్టబోయే పిల్లలకు చక్కటి తమిళపేర్లే పెట్టండి.

- ఎం.కె.స్టాలిన్, ముఖ్యమంత్రి

జనన మరణాల రేటులో తమిళనాడు స్థిరంగా ఉన్నట్లు ఈ ఏడాది జులైలో ఆరోగ్యశాఖమంత్రి మా.సుబ్రమణియన్ వ్యాఖ్యానించారు. ఇలా దేశంలో మరే రాష్ట్రమూ లేదని తెలిపారు. జనాభా నియంత్రణలో రాష్ట్రం విజయవంతంగా నడుస్తోందనేది ఆయన మాటల ఉద్దేశం. 2013లో తమిళనాడు జనాభా 7.33 కోట్లు. ఇప్పుడు 7.71కోట్లుగా ఉండొచ్చని అంచనా. 2031కి 7.80 కోట్లకు చేరుకుని.. 2032 నుంచి తగ్గుముఖం పట్టొచ్చని ఆరోగ్యశాఖ అంచనాలు వేసింది. మరోవైపు రాష్ట్రంలో ఏటా జననాల సంఖ్య బాగా తగ్గుతోంది. రాష్ట్రంలో జననాల రేటు ప్రతి 1000 మందికి 13.8గా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దేశ సగటు మాత్రం 19.50గా ఉంది. జాతీయ సగటుతో పోల్చితే తమిళనాడు 5.7 తక్కువగా కొనసాగుతోంది. జనాభా పెరుగుదల క్రమంగా తగ్గుతోందని చెప్పడానికి ఇదొక తార్కాణం. జనాభా వృద్ధి గతంతో పోల్చితే 7.7 శాతం తగ్గించినట్లుగా ప్రభుత్వం చెబుతోంది. జననాలరేటు తక్కువగా ఉన్న కారణంగా రాష్ట్ర జనాభా ఇతర కొన్ని రాష్ట్రాలతో పోల్చితే వెనకబడి ఉన్నట్లు స్పష్టమవుతోంది.

జీవితకాలం పెరిగింది..

జాతీయ సగటు జీవితకాలపు అంచనా 68.2 ఏళ్లుగా ఉండగా.. దాంతో పోల్చితే తమిళనాడులో బాగా ఎక్కువగా ఉంది. సగటున ఇక్కడివారి జీవితకాలపు అంచనా 71.4 ఏళ్లుగా ఉంది. ఐక్యరాజ్యసమితి జనాభా నిధి (యూఎన్ఎఫ్‌పీఏ), ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్(ఐఐపీఎస్) ఇచ్చిన 'ఇండియా ఏజింగ్ రిపోర్ట్ 2023' ప్రకారం తమిళనాడులో వయసుమీరినవారి సంఖ్య బాగా ఉన్నట్లు వెల్లడించారు. వారి రేటు 2021 నుంచి 2036 మధ్య బాగా పెరిగే అవకాశముందన్నట్లుగా పేర్కొన్నారు. దానికి తోడు రాష్ట్రంలో మరణాల రేటు తగ్గుతూ వస్తోంది. పెద్దవయసువారి జనాభా విషయానికొస్తే.. 13.7శాతం నుంచి 20.8శాతానికి పెరగొచ్చని అంచనాగా చెబుతున్నారు. ఒక్క తమిళనాడేకాక దేశంలోని ఇతర ప్రముఖ రాష్ట్రాలూ ఇదేబాటలో ఉన్నాయి.

లోక్‌సభ స్థానాలపై ప్రభావం



- ఓ వైపు జననాలరేటు భారీగా తగ్గడం, మరోవైపు జీవితకాలం పెరగడంతో ఈ ప్రభావం లోక్‌సభ పునర్విభజన మీద పడుతుందని రాజకీయంగా చర్చ నడుస్తోంది. రాబోయే జనాభా లెక్కల ఆధారంగా ఈ స్థానాల్లో భారీ మార్పులుంటాయని అంచనాలు వేస్తున్నారు. జనాభా ప్రాతిపదికన పార్లమెంటు స్థానాల సంఖ్య ఆధారపడి ఉంటుంది. ఇప్పుడున్న జననాల రేటుకు మించి పిల్లల పుట్టుక ఉంటే మాత్రమే సీట్లు పెరిగే అవకాశముందని, అలాకాకుండా ఇప్పుడున్నట్లుగానే కొనసాగితే మాత్రం.. సీట్లు తగ్గు అవకాశముందని అంచనాలున్నాయి.
- ప్రస్తుతం లోక్‌సభలో 543 ఎంపీ సీట్లున్నాయి. లోక్‌సభ స్థానాల్ని పెంచకుండా జనాభాను అనుసరించి పార్లమెంటు స్థానాల పునర్విభజన జరిగితే. . ఇతర కొన్ని రాష్ట్రాలతో పోల్చితే తమిళనాడు జనాభా పెరుగుదల తక్కువే. ఇప్పుడున్న 39 స్థానాలు కాస్తా 30 లేదా 31కి తగ్గొచ్చనే అంచనాలున్నాయి.
- అదే లోక్‌సభ స్థానాల్ని 848కి పెంచి, మారిన జనాభా గణాంకాల్ని పరిగణలోకి తీసుకుంటే రాష్ట్రంలో 39 సీట్ల నుంచి 49 సీట్లకు పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అంటే కేవలం 10సీట్లు మాత్రమే పెరగొచ్చు. యూపీ, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి జనాభా బాగా పెరుగుదల ఉన్న రాష్ట్రాలతో పోల్చితే తమిళనాడుకు పెరిగే స్థానాలు తక్కువని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

డీఎంకే దూకుడు

పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనపై డీఎంకే గతంలోనూ స్పందించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో పునర్విభజన ప్రక్రియను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం సైతం చేశారు. మరోవైపు ఇదే అసెంబ్లీ నుంచి 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' ప్రతిపాదనను సైతం వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. తద్వారా కేంద్ర ప్రభుత్వానికి బలమైన సంకేతాల్ని డీఎంకే పంపిందన్నట్లు అప్పట్లో పెద్దఎత్తున రాజకీయ చర్చ నడిచింది.

స్టాలిన్ ఇచ్చిన సంకేతం

ఈ ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీ తీర్మానం చేసిన తర్వాత ముఖ్యమంత్రి స్టాలిన్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. 'బాజపా కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ఎజెండాకు వ్యతిరేకంగా నిర్ణయాన్ని తీసుకున్నాం' అన్నట్లుగా రాశారు. పార్లమెంటు స్థానాల పునర్విభజన ప్రక్రియలో రాష్ట్రానికి అన్యాయం జరిగేలా కేంద్రం వ్యవహరిస్తోందని, ఇది సామాజిక ఆర్థిక పురోగతి మీద ప్రభావం చూపుతుందనే భావన ఉందని స్టాలిన్ తెలిపారు. జనాభా నియంత్రణను విజయవంతంగా చేసినందుకు ఇది శిక్షగా తీసుకోవాలా అన్నట్లుగా వ్యాఖ్యానించారు. పునర్విభజన, ఒకే దేశం ఒకే ఎన్నిక.. ఈ రెండు ప్రతిపాదనలు దేశానికి విఘాతమన్నట్లుగా అప్పట్లో చెప్పారు.

రాబోయే అన్ని ఎన్నికల్లోనూ డీఎంకేదే గెలుపు

ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 2026లో జరిగే శాసన సభ ఎన్నికలు మాత్రమే కాక ఆ తర్వాత వచ్చే అన్ని ఎన్నికల్లోనూ డీఎంకేనే గెలుస్తుందని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. డీఎంకే మాజీ ఎమ్మెల్యే దివంగత గుమ్మిడిపూండి వేణు మనవడు, తిరువళ్లూర్ జిల్లా పంచాయతీ యూనియన్ అధ్యక్షురాలు ఉమా మహేశ్వరి కుమారుడైన స్టాలిన్-యువశ్రీ వివాహం బుధవారం నగరంలోని అన్నా అరివాలయంలో జరిగింది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో వివాహాన్ని జరిపించి వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజాసేవలో డీఎంకే శ్రేణులు ముందుంటాయని, ప్రజల కోసం కృషి చేస్తారని తెలిపారు. ఆరోసారి అధికారంలోకి వచ్చిన డీఎంకే పలు పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. ప్రజల నిరాకరణకు గురైన ఎడప్పాడి పళనిసామి దానిని సహించలేక డీఎంకే ప్రభుత్వ పరపతి తగ్గుతోందని, కూటమి త్వరలో విచ్ఛిన్నమవుతుందని మాట్లాడుతున్నారని తెలిపారు. ఆయన ఊహాలోకంలో విహరిస్తున్నట్లు ఇప్పటివరకు భావించానని, ప్రస్తుతం జోతిష్యుడిగా మారారని ఎద్దేవా చేశారు. తమ కూటమి ఎన్నికలు, పదవి కోసం ఏర్పడలేదని, సిద్ధాంతాలపరంగా ఏర్పడిందని గుర్తుచేశారు. కూటమిలో వివాదాలు జరిగినా చీలికలు ఉండవన్నారు. తమ పార్టీని చూసి ఆయన ఓర్వలేకపోతున్నారని



వధూవరులతో ముఖ్యమంత్రి దంపతులు, మంత్రులు తదితరులు

విమర్శించారు. డీఎంకే ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్, కోశాధికారి, ఎంపీ టీఆర్ బాలు, ముఖ్యకార్యదర్శి, మంత్రి కేఎన్ నెహ్రూ, ఉప కార్యదర్శి పొన్ముడి, పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.ఎస్.భారతి, మంత్రులు నాజర్, పీకే శేఖర్‌బాబు, కయల్‌విళి సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పట్టాల అందజేత

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్ జిల్లా కొడైక్కెనాల్‌లోని మదర్ థెరిస్సా మహిళా విశ్వవిద్యాలయం 31వ స్నాతకోత్సవంలో బుధవారం గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొని విద్యార్థినులకు పట్టాలు అందించారు. అనంతరం శంకరా విద్యాలయ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేవునిపై నమ్మకం ఉన్నవారు సరస్వతి చిత్రపటం ముందుంచుకొని చదువుకుంటే బాగా రాణించగలరని చెప్పారు. తాను వెనుకబడిన కుటుంబంలో పుట్టానన్నారు. తన మనవడు, మనవరాళ్లకు దైవభక్తి అధికంగా ఉందని తెలిపారు.

పోస్టర్ల కలకలం.. ఇటీవల గవర్నర్ పాల్గొన్న ఓ కార్యక్రమంలో తమిళతల్లి ప్రార్థనాగీతంలో ద్రావిడం



పట్టా అందిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

పదాన్ని వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కొడైక్కెనాల్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన గవర్నర్ ఆర్ఎన్ రవి బస చేసిన హోటల్ ఎదుట, ఆయన వెళ్లే మార్గాల్లో 'సిరంద ద్రావిడ నల్ తిరునాడుం' అనే వ్యాఖ్యలతో కూడిన పోస్టర్లను ద్రావిడర్ తమిళర్ మండ్రం తరఫున అంటించారు.

వేలూర్ డీఐజీ, ఎస్పీ సస్పెన్షన్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: వేలూరు డీఐజీ, ఎస్పీలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కృష్ణగిరి జిల్లా మాణిక్యంపేటకు చెందిన శివకుమార్ అనే వ్యక్తిని పోలీసులు హత్య కేసులో అరెస్టు చేసి వేలూర్ జైల్లో ఉంచారు. కొద్దినెలల కిందట వేలూర్ జైళ్ల శాఖ డీఐజీ రాజలక్ష్మి ఇంట్లో శివకుమార్ పని చేశాడు. ఆ సమయంలో అతన్ని చిత్రహింసలు పెట్టినట్లు శివకుమార్ తల్లి కళావతి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణను సీబీసీఐడీకి బదిలీ చేస్తూ న్యాయమూర్తులు ఆదేశించారు. సీబీసీఐడీ పోలీసులు రాజలక్ష్మి, జైలు సూపరింటెండెంట్ అబ్దుల్‌రెహ్మాన్‌తో పాటు సిబ్బంది 14 మంది వద్ద దర్యాప్తు జరిపారు. శివకుమార్‌ను చిత్ర హింసలు చేసినట్లు తేలడంతో రాజలక్ష్మి, అబ్దుల్‌రెహ్మాన్, జైలర్ అరుళ్‌కుమరన్‌ను సస్పెండు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఆదేశించింది.



రాజలక్ష్మి, అబ్దుల్‌రెహ్మాన్

డీఎంకే కూటమిలో గందరగోళం లేదు: కె.బాలకృష్ణన్

ప్యారిస్, న్యూస్‌టుడే: డీఎంకే కూటమిలో ఎలాంటి గందరగోళం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ తెలిపారు. మదురైలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. పార్టీ అఖిల భారత మహానాడు మదురైలో వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 6 వరకు జరగనుందని తెలిపారు. గవర్నర్ ఆర్ఎన్ రవి పదవీకాలం పూర్తయినా కేంద్ర ప్రభుత్వం ఇంకా కొత్తవారిని నియమించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించే వ్యక్తిని కేంద్ర ప్రభుత్వం గవర్నర్‌గా నియమించాలని తెలిపారు. సీపీఎం విషయానికొస్తే గవర్నర్ పదవి అవసరంలేదన్నారు. డీఎంకే కూటమి అన్నాడీఎంకేలా బానిస కూటమి కాదన్నారు.

మాతాశిశు మరణాల తగ్గింపునకు ప్రత్యేక చర్యలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: మాతాశిశు మరణాలు అడ్డుకునేలా ఎమర్జెన్సీ వార్ రూమ్ ఏర్పాటు పనులను రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రారంభించింది. మాతాశిశు మరణాల నిష్పత్తి(ఎంఎంఆర్) తగ్గించేందుకు ఈ ఏడాది అక్టోబరులో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ తొలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డేటాను విశ్లేషించి ప్రసవానంతర కాలంలో 74.25 శాతం ప్రసూతి మరణాలు సంభవించాయని నివేదించారు. సమగ్ర ప్రసూతి ప్రణాళిక వ్యవస్థ



మాట్లాడుతున్న కార్యదర్శి సుప్రియ సాహు

ప్రవేశపెట్టాలని, వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని, నైపుణ్యాభివృద్ధి ఆధారిత శిక్షణా శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశానికి ఆరోగ్యశాఖ కార్యదర్శి సుప్రియ సాహు నేతృత్వం వహించారు. 2014-2024 నాటి డేటా ప్రకారం 72శాతం మరణాలు గ్రామీణ ప్రాంతాల్లో, మిగిలిన 28 శాతం పట్టణ ప్రాంతాల్లో సంభవించాయి. తంజావూర్, దిండుక్కల్, మైలాడుదురై, తేని, నామక్కల్, పుదుకోట్టై, చెంగల్పట్టు తదితర జిల్లాలో ఎంఎంఆర్ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

డిమాండ్లపై స్పందించకుంటే కేబుల్ టీవీ ప్రసారాలు నిలిపివేత

చెన్నై, న్యూస్‌టుడే: తమ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే తొలి విడత నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా గంటపాటు కేబుల్ టీవీ ప్రసారాలు నిలిపివేస్తామని రాష్ట్ర కేబుల్ టీవీ ఆపరేటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెళ్లైసామి తెలిపారు. ఎగ్మూర్‌లోని రాజరత్నం స్టేడియం వద్ద రాష్ట్ర కేబుల్ టీవీ ఆపరేటర్ల సంక్షేమ సంఘం తరపున ఆందోళన జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షులు సగిలన్ నేతృతంలో జరిగిన ఆందోళనలో కేబుల్ టీవీ ఆపరేటర్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై, వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్, ఎండీఎంకే రాజకీయ అధ్యయన కేంద్రం కార్యదర్శి అందరిదాస్ తదితరులు సంఘీభావం తెలిపారు.



మాట్లాడుతున్న వెళ్లైసామి

సంఘం అధ్యక్షుడు వెళ్లైసామి మీడియా సమక్షంలో మాట్లాడుతూ.. పే ఛానెళ్ల గరిష్ఠ ఛార్జీలను రూ.19 నుంచి రూ.5కు తగ్గించాలని, కేబుల్ టీవీ ఆపరేటర్లకు విధించే 18శాతం జీఎస్టీ రద్దు చేయాలని, పే ఛానెళ్ల ఏటా ఛార్జీలు పెంచవచ్చనే అనుమతి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎస్ఎంఈగా కేబుల్ టీవీ ఆపరేటర్ల వృత్తికి కనీస డాక్యుమెంట్లు స్వీకరించి విద్యుత్తు ఛార్జీలో రాయితీ ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో అమర్చిన టాన్‌ఫినెట్ కేబుళ్ల ద్వారా తక్కువ ఛార్జీతో కేబుల్ సేవలను అందించడానికి కేబుల్ టీవీ ఆపరేటర్లకు ప్రభుత్వం అనుమతివ్వాలని కోరారు. ముఖ్యమంత్రికి, కేంద్ర టెలీ కమ్యూనికేషన్లశాఖ మంత్రి, అధికారులకు వినతిపత్రాలు అందిస్తామని తెలిపారు.

దీపావళికి రాయితీతో వస్తువులు

పుదుచ్చేరి సీఎం రంగసామి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో దీపావళి పండుగ సందర్భంగా రూ.వెయ్యి విలువైన 10 వస్తువులు రూ.500 రాయితీ ధరతో అందిస్తామని ముఖ్యమంత్రి రంగసామి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఈ ఏడాది దీపావళి బహుమతిగా రూ.5 వేలు, అసంఘటిత కార్మికులకు రూ.1,500 అందజేస్తామన్నారు. రేషన్ దుకాణాల ద్వారా ఉచిత బియ్యం, చక్కెర అందజేస్తామన్నారు. ప్రస్తుతం 30 దుకాణాలను మాత్రమే ప్రారంభించినట్లు తెలిపారు. ఆ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో ఉచితంగా బియ్యం అందుకోవచ్చని చెప్పారు. కాన్‌ఫెడ్ కంపెనీ ద్వారా దీపావళికి పుదుచ్చేరి ప్రజలకు రాయితీపై 10 వస్తువులు అందించనున్నట్లు తెలిపారు. ప్రజలు రేషన్‌కార్డులు చూపి తట్టంజావడి విక్రయకేంద్రం ప్రాంగణంలో రూ.500 రాయితీ ధరలో పొందవచ్చని పేర్కొన్నారు. త్వరలో పది వస్తువుల గురించి వివరిస్తామని చెప్పారు.

పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులకు పండగ భృతి ఇవ్వాలి: సీమాన్

చెన్నై, న్యూస్‌టుడే: పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులకు దీపావళికి ముందే పండగ భృతి, నవంబరు వేతనం అందించాలని నామ్ తమిళర్ కట్చి చీఫ్ కన్వీనర్ సీమాన్ డిమాండ్ చేశారు. ఆయన తన ప్రకటనలో... 2021 శాసనసభ ఎన్నికల హామీ ప్రకారం పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులను డీఎంకే ప్రభుత్వం పర్మినెంట్ చేసి ఉంటే ప్రస్తుతం ఇతర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు లభించే అన్ని హక్కులు అందేవన్నారు. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడిచినా పర్మినెంట్ చేయకపోవడం పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులకు చేసే మహాద్రోహమని పేర్కొన్నారు. రూ.12,500 తక్కువ వేతనంతో సర్దుబాటు చేసుకుంటున్న 12వేల మంది పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు 13ఏళ్లుగా పర్మినెంట్ కోసం పోరాడుతున్నారని తెలిపారు.

నారాయణస్వామితో ఎప్పటి నుంచో అభిప్రాయభేదాలున్నాయి

మంత్రి నమశ్శివాయం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: మాజీ సీఎం నారాయణస్వామికి తనకు రాజకీయపరంగా పలు అభిప్రాయభేదాలు ఉన్నాయని పుదుచ్చేరి మంత్రి నమశ్శివాయం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ల్యాప్‌టాప్, ఉచిత సైకిళ్లు అందిస్తున్నామని చెప్పారు. త్వరలో పుస్తకాల సంచి, షూలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే నారాయణస్వామి తరచూ తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆయన చెప్పేది నిజమా కాదా అనేది ప్రజలకు తెలుసన్నారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పటి నుంచే తమ ఇద్దరి మధ్య రాజకీయపరంగా అభిప్రాయభేదాలు ఉండేవన్నారు.

50 పైసలు అదనంగా తీసుకున్నందుకు

రూ.15 వేల పరిహారం

వడపళని, న్యూస్‌టుడే: పోస్టాఫీసులో రిజిస్టర్డ్ ఉత్తరానికి ఛార్జీలో 50 పైసలు అదనంగా తీసుకున్నందుకు రూ.15 వేలు జరిమానాగా చెల్లించాలని జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశించింది. 2023 డిసెంబరు 3న గెరుగంబాక్కానికి చెందిన మనషా రిజిస్టర్డ్ ఉత్తరం పంపేందుకు పొళిచ్చలూరు తపాలా కార్యాలయానికి వెళ్లాడు. ఛార్జీ రూ.29.50 కాగా కౌంటరులోని ఉద్యోగి రూ.30 ఇవ్వాలని అడిగాడు. మిగిలిన చిల్లర ఇవ్వాలని మనషా అడగ్గా సిస్టమ్ ఆటోమేటిక్‌గా రూ. 30గా చూపిస్తోందన్నాడు. యూపీఐ విధానంలో చెల్లిస్తామనగా సాంకేతిక కారణం చూపుతూ కుదరదని చెప్పాడు. ఈ విషయమై మనషా జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. 50 పైసల కన్నా తక్కువగా ఉంటే మరచిపోవాలని, ఎక్కువ ఉంటే దగ్గరగా ఉండే రూపాయితో సాఫ్ట్‌వేర్ సరి చేస్తుందని తపాలా సిబ్బంది జవాబిచ్చారు. డిజిటల్ చెల్లింపు విధానం 2023 నవంబరు నుంచి సరిగా పని చేయక పోవడంతో ఈ ఏడాది మే నెలలో వాటిని తొలగించినట్లు పేర్కొన్నారు. ఇరువురి వాదనలు విన్న కమిషన్.. సాఫ్ట్‌వేర్ కారణంగా అధికంగా ఛార్జీలు చేయడం 2019లోని కన్స్యూమర్ ప్రొటెక్షన్ చట్టం ప్రకారం సబబు కాదని తెలిపింది. బాధితుడికి రూ.10 వేల పరిహారం, న్యాయ ఖర్చుల కింద రూ.5 వేలను అధికంగా ఛార్జీ చేసిన 50పైసలతో కలిపి చెల్లించాలని కమిషన్ తీర్పు చెప్పింది.

శోళింగర్ ఆలయంలో

2 రోజులు రోప్‌కార్ సేవలు రద్దు

శోళింగర్, న్యూస్‌టుడే: శోలింగర్ ఆలయంలో రోప్‌కార్ సేవలు రెండు రోజుల పాటు రద్దు చేశారు. ఇక్కడి మహాకొండపై అమృతవల్లి తాయారు సమేత నరసింహస్వామి ఆలయం ఉంది. గుడికి వెళ్లడానికి 1,305 మెట్లదారి ఉంది. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చి వెళుతుంటారు. వృద్ధులు, మహిళలు, కొండమెట్లు ఎక్కలేనివారి కోసం మార్చిలో ప్రభుత్వం రోప్‌కార్ ఏర్పాటు చేసింది. అందులో ఒక్కొక్కరికి రూ.100 వసూలు చేస్తున్నారు. నెలవారి మరమ్మతుల కారణంగా రోప్‌కార్‌సేవలను 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు నిలిపివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

గ్లోబల్ సిటీగా చెన్నై

- తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు
- సీఎండీఏ సభ్య కార్యదర్శి అన్షుల్ మిశ్రా

వడపళని, న్యూస్‌టుడే: భవిష్యత్తులో చెన్నై మహానగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు భారీ స్థాయిలో జరుగుతున్నాయని చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సీఎండీఏ) సభ్య కార్యదర్శి అన్షుల్ మిశ్రా అన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఆధ్వర్యంలో బుధవారం ఇన్‌ఫ్రా సదస్సు జరిగింది. అన్షుల్ మిశ్రా మాట్లాడుతూ నగరానికి మూడో మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతోందని చెప్పారు. ఆర్థికంగా వృద్ధి సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. స్థలాలకు అనుగుణంగా పరిశ్రమల విస్తరణ, గృహ నిర్మాణాలు, అన్ని రకాల సదుపాయాలు అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కిళాంబాక్కం బస్ టెర్మినస్, తీర ప్రాంతాల అభివృద్ధి వంటి ప్రాజెక్టులను ఉదహరించారు. ప్రస్తుతం చెన్నైలో ఏడాదికి 23 వేల వరకు ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, వాటి



పుస్తకావిష్కరణలో అన్షుల్ మిశ్రా, శంకరం తదితరులు

సంఖ్య హైదరాబాద్, బెంగళూరులలో 80 వేలు, ముంబైలో 1.25 లక్షలుగా ఉందన్నారు. నగరంలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని గృహ వసతులు, పెరుగుతున్న ఖర్చులను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని మిశ్రా అన్నారు. ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. నగర పరిసరాల్లో 40 పారిశ్రామికవాడలున్నాయని, చెన్నై ఆటోమొబైల్, ఐటీ, ఆరోగ్య సంరక్షణలకే పరిమితం కాలేదని, పెద్ద అర్బన్ కేంద్రంగా కూడా వృద్ధి చెందుతోందని తెలిపారు. 2030 నాటికి జనాభా 14 మిలియన్లకు చేరుకుంటుందని, అందుకు తగ్గట్లు మౌలిక సదుపాయాల కల్పన కూడా అవసరమని సీఐఐ తమిళనాడు స్టేట్ కౌన్సిల్ ఛైర్మన్, వీల్స్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీవత్స్ రామ్ పేర్కొన్నారు. చెన్నై నౌ అండ్ నెక్స్ట్- వేస్ టు ఇంప్రూవ్ చెన్నైస్ లివబులిటీ ఇండెక్స్, ఎనేబ్లింగ్ పబ్లిక్ అస్సెట్ మోనటైజేషన్, రీడెవలప్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇనిషియేటివ్స్- నీడ్ ఎ క్లోజర్ లుక్ ఫ్రమ్ పీపీపీ మోడల్ పెర్స్‌పెక్టివ్ అంశాలపై సదస్సు జరిగింది. సీఐఐ చెన్నై జెన్, ఇండియా హెడ్ ఎ.శంకరం, ఒలింపియా గ్రూపు సంస్థల వైస్ ఛైర్మన్ అజిత్ ఖోర్డియా తదితరులు హాజరయ్యారు.

దీపావళి ప్రత్యేక రైళ్లు

వడపళని, న్యూస్‌టుడే: దీపావళి పండుగకు పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే బుధవారం ప్రకటన విడుదల చేసింది.

- **06001** చెన్నై సెంట్రల్‌లో 29, నవంబరు 5 తేదీ(మంగళ) 23.45కు బయలుదేరి మరుసటి రోజు 12.15కు కన్నియాకుమారి చేరుతుంది.
- **06002** కన్నియాకుమారిలో 30, నవంబరు 6(బుధ) 14.45కు బయలుదేరి మరుసటి రోజు 03.15కు ఎగ్మూరు వస్తుంది.
- **06005** చెన్నై సెంట్రల్‌లో 30, నవంబరు 6(బుధ) 19.00కు బయలుదేరి మరుసటి రోజు 09.20కి సెంగోట్టై వెళ్తుంది.
- **06006** సెంగోట్టైలో 31, నవంబరు 7(గురు) 19.30కి బయలుదేరి మరుసటి రోజు 09.30కి చెన్నై సెంట్రల్ వస్తుంది.
- **06003** తిరునెల్వేలిలో నవంబరు 3న 16.00కు బయలుదేరి మరుసటి రోజు 04.10కి తాంబరానికి వస్తుంది.
- **06004** తాంబరంలో నవంబరు 4న 14.30కి బయలుదేరి మరుసటి రోజు 05.15కి తిరునెల్వేలి చేరుకుంటుంది.
- **06049** తాంబరంలో 29, నవంబరు 5, 12, (మంగళ) 00.35కు బయలుదేరి అదే రోజు 12.15కి కన్నియాకుమారి చేరుతుంది.
- **06050** కన్నియాకుమారిలో 29, నవంబరు 5, 12 (మంగళ) 15.35కి బయలుదేరి మరుసటి రోజు 04.20కి తాంబరానికి వస్తుంది. ఈ రైళ్లకు రిజర్వేషన్లు కూడా ప్రారంభమయ్యాయి.

రద్దయినవి... 'దానా' తుపాను కారణంగా **12830** భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ 12.10 రైలు 24న, **12829** చెన్నై సెంట్రల్ - భువనేశ్వర్ 10.00 రైలు 25 తేదీల్లో రద్దయ్యాయి.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు


సూచనలిస్తున్న డీఎస్పీ శాంతి

ఊత్తుకోట, న్యూస్‌టుడే: ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఊత్తుకోట డీఎస్పీ హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 650 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల సమయాల్లో బయట తిరగడంతోపాటు సినిమా థియేటర్లకు వెళుతున్నారు. విద్యార్థుల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు ఘర్షణకు దిగితే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రుల కలలు సాకారం చేసే బాధ్యత ప్రతి విద్యార్థికి ఉందని, ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. సీఐ తమిళ్‌సెల్వి, పట్టణ పంచాయతీ ఉపాధ్యక్షుడు కుమరవేల్, పీటీఏ అధ్యక్షుడు తమిళ్‌సెల్వన్, ప్రధానోపాధ్యాయుడు జయచంద్రన్ పాల్గొన్నారు.

శాఖాధికారులతో మంత్రి చక్రపాణి సమీక్ష

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చెన్నై సచివాలయంలో ఆహార శాఖమంత్రి చక్రపాణి మంగళవారం శాఖాధికారులతో సమీక్ష జరిపారు. 2024-25 ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు, ఈశాన్య రుతుపవనాల వర్షాలకు ముందస్తు చర్యలపై చర్చించారు.

కాంగ్రెస్‌వి వారసత్వ రాజకీయాలు


తమిళిసై

సైదాపేట: కాంగ్రెస్ వారసత్వ రాజకీయాలు చేస్తుందని భాజపా మాజీ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆరోపించారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ వయనాడ్ ప్రజలను మోసం చేశారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్‌లో పోటీ చేసిన రాహుల్ గాంధీ తాను వేరే నియోజకవర్గంలో పోటీ చేస్తున్నట్లు ముందే చెప్పలేదని అన్నారు. వయనాడ్ ప్రజలు చాలా నమ్మకంతో రాహుల్ గాంధీకి ఓటు వేశారని, నమ్మిన ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో వయనాడ్‌లో పోటీ చేసేందుకు ఎందరో నేతలు ఉండగా ప్రియాంక గాంధీని ఎందుకు పోటీ చేయించనున్నారని అన్నారు.

టీవీకే మహానాడు ఏర్పాట్లు 90 శాతం పూర్తి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ప్రముఖ నటుడు విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం మొదటి మహానాడు విళుపురం జిల్లా విక్రవాండి సమీప వి.సాలై గ్రామం వద్ద 27న నిర్వహించనున్నారు. మహానాడు పనులు 90 శాతం పూర్తయ్యాయి. జాతీయ రహదారి పక్కన మహానాడు నిర్వహణకు అనుమతి, రోడ్డు భద్రత తదితర అంశాలపై సమాలోచనలు జరపడానికి పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ కోర్టు మేరకు నజాయ్ పథకం డైరెక్టర్ వరదరాజన్, తదితరులు ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి నార్త్ జోన్ ఐ.జీ అస్రాగార్గ్, డీఐజీ దిషా మిట్టల్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో మహానాడు భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమాలోచనలు జరిపారు. అనంతరం విళుపురం, కళ్లకురిచ్చి జిల్లాల ఎస్పీలు దీపక్ శివాచ్, రాజ్ చతుర్వేది, విళుపురం ఏడీఎస్పీలు తిరుమాల్, దినకరన్, తదితరులు మహానాడు ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రసూతి ప్రయోజనాలకు ఒప్పంద నర్సులు అర్హులే: హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద నర్సులు ప్రసూతి ప్రయోజనాలను పొందేందుకు అర్హులేనని మద్రాసు హైకోర్టు తెలిపింది. ఆరోగ్య మిషన్ కింద రాష్ట్రంలో 11 వేల మంది నర్సులు ఒప్పంద ప్రాతిపదికన నియమితులయ్యారు. రెండేళ్లకు పైగా పని చేసిన వారికి 270 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవు ఇవ్వడానికి తమిళనాడు ప్రభుత్వం నిరాకరించడంతో ఎమ్‌ఆర్‌బీ నర్సుల సాధికారిక సంఘం తరఫున హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ కేసు చీఫ్ జస్టిస్ కేఆర్ శ్రీరామ్, జస్టిస్ సెంథిల్‌కుమార్ రామమూర్తి ధర్మాసనంలో మంగళవారం విచారణకు వచ్చింది. వర్షంలో ఉన్న అర్హతలను పూర్తిచేసిన పక్షంలో ఒప్పంద కార్మికులకు ప్రసూతి ప్రయోజనాలు నిరాకరించకూడదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపింది. పెండింగ్‌లోని దరఖాస్తులను మూడు నెలల్లో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు.

కిక్ బాక్సింగ్ విజేతకు అభినందనలు


నీనా

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం సమీప పుత్తేరి ప్రాంతానికి చెందిన సీలగండన్ కుమార్తె నీనా(21) స్థానిక వన్‌మెన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో కిక్ బాక్సింగ్‌లో శిక్షణ పొందుతోంది. ఇటీవల కాంబోడియాలో నిర్వహించిన ఆసియా కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని మహిళా విభాగంలో బంగారు పతకం, రెండు వెండి పతాకాలు గెలుచుకుంది. నీనాను మంగళవారం సాయంత్రం కాంచీపురంలో అన్నాపార్క్ వాకింగ్ గ్రూప్ తరఫున అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముక్కల్ నీది మయ్యం రాష్ట్ర కార్యదర్శి కాంచీపురం జోన్ గోపీనాథ్ రూ.10 వేల చెక్కు అందించారు.

ఐఐటీలో నవంబరు 16, 17 తేదీల్లో సదస్సు



వడపళని, న్యూస్‌టుడే: 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ (ఐఐటీఎం)లోని 'ఎక్స్‌పీరియన్షియల్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ (ఎక్స్‌టీఐసీ) ఆధ్వర్యంలో 'ఎక్స్‌టెన్డెడ్ రియాలిటీ' (ఎక్సార్) సదస్సు జరగనుంది. ఐఐటీ మద్రాస్ ప్రాంగణంలో నవంబరు 16, 17 తేదీల్లో జరిగే సదస్సులో సాంకేతిక రంగంలో అనుభవజ్ఞులైన ప్రతినిధులు పాల్గొననున్నారని ఐఐటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'డిజిటల్ ఇండియా'గా దేశం పురోగమిస్తున్న తరుణంలో పలువురు వక్తలు ప్రసంగించనున్నారు. పాపులర్ ఓకులస్ సహ వ్యవస్థాపకుడు, ఆధ్యాయులు స్టెవీ లావాల్లే, ఎంబెట్ హాప్టిక్స్ ల్యాబ్ వ్యవస్థాపకుడు, ఆధ్యాయులు మండయం శ్రీనివాసన్, ఎక్సార్ సైరాంజ్ ఆధ్యాయులు మేల్ స్లేటర్ వంటి ప్రముఖులు సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు. సదస్సులో పాల్గొనే వారు నవంబరు 9వ తేదీలోగా 'పేర్ల నమోదు చేసుకోవాలి. పరిశ్రమవారు, స్టార్టప్స్, పరిశోధకులు https://xtic.org/xr-summit, https://xrsummit.xtic.org లింకు ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి.

రేస్ కోర్సులో చెరువుల నిర్మాణంపై అభ్యంతరాలు

త్వరలో ప్రభుత్వానికి ఏఏఐ లేఖ


గిండీ రేస్ కోర్స్ మైదానం

వడపళని, న్యూస్‌టుడే: గిండి మద్రాస్ రేస్ క్లబ్ స్థలంలో నాలుగు చెరువుల నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో చెరువుల నిర్మాణంతో పక్షులు ప్రవేశించి విమానాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 160.86 ఎకరాల మేర ఉన్న మద్రాస్ రేస్ క్లబ్ స్థలాన్ని ఆధీనంలోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అనంతరం 118 ఎకరాల్లో ఎకో పార్కు నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించింది. నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్(ఎన్జీటీ) 160 ఎకరాల స్థలంలో వాననీటి నిల్వ కోసం నాలుగు చెరువులను నిర్మించాలని చెన్నై మహానగర కార్పొరేషన్(జీసీసీ)ను ఆదేశించింది. గిండి, వేళచ్చేరి, అడయార్ పరిసర ప్రాంతాల వారికి వాననీరు రాజ్‌భవన్ కాలువలోకి వెళ్లకుండా రేస్ క్లబ్‌లో నిర్మాణం కానున్న చెరువులోకి చేరే వీలుంది. నాలుగు చెరువుల్లో 0.8 మిలియన్ క్యూబిక్ అడుగుల నీటి నిల్వకు వీలుందని మరో మూడు వారాల్లో పూర్తయ్యే అవకాశాలున్నాయని జీసీసీ పేర్కొంది.

పక్షుల రాకకు అవకాశాలు

చెరువుల్లోకి పక్షులు వచ్చి చేరుకునే అవకాశాలు బాగానే ఉన్నాయని ముంబైలోని 'నేచురల్ హిస్టరీ సొసైటీ' మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.బాలచంద్రన్ అన్నారు. నీరు ఉండే లోతును అనుసరించి పక్షుల రాక ఉంటుందన్నారు. ఎక్కువ లోతు ఉంటే అధికంగా వస్తాయని చెప్పారు. ఈ ప్రక్రియ జరగడానికి మరో రెండేళ్లు పట్టొచ్చని, ముఖ్యంగా వలస పక్షులు, ఎక్కువ ఎత్తు ఎగరకుండా స్థానికంగా ఉండే పక్షులను అప్పటికి చూడగలమని బాలచంద్రన్ వివరించారు.

విమాన రాకపోకలకు అంతరాయం..

గిండి చివరి ప్రాంతమైన ప్రధాన రన్‌వే(25) వద్ద భవిష్యత్తులో పక్షుల బెడద ఎక్కువవుతుందని ఏఏఐ అధికారులు పేర్కొన్నారు. పక్షులు తక్కువ ఎత్తులో గుంపుగా ఎగురుతుంటాయని, విమానాలు నడపటం చాలా ప్రమాదమన్నారు.

ఇప్పటికే మూడు..

రేస్ క్లబ్బులో ఇప్పటికే నీటి నిల్వకు మూడు చెరువులు ఉన్నాయని, అదనంగా మరి కొన్నింటిని నిర్మిస్తున్నామని కార్పొరేషన్ కమిషనరు జె.కుమార గురుభరన్ అన్నారు. చెరువుల వద్ద పక్షులు చేరడం సహజమేనని, 162 ఎకరాల స్థలాన్ని చెరువుల కోసం వినియోగించడం లేదని పేర్కొన్నారు. నాలుగైదు ఎకరాల్లో మాత్రమే వాటి నిర్మాణం జరగనున్నట్లు చెప్పారు. ఏఏఐ నుంచి లేఖ అందితే సమాధానమిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

అక్రమాస్తులు కూడబెట్టిన ప్రభుత్వ ఇంజినీర్‌పై కేసు

కాంచీపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా పశ్చిమ తాంబరానికి చెందిన కుజరాజ్(45) పాలారు పరివాహక డివిజన్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా పని చేశారు. ప్రస్తుతం చెంగల్పట్టు జిల్లా జలవనరులశాఖలో ఇంజినీర్‌గా ఉన్నారు. పడప్పై పరిసరాల్లోని ముడిచ్చూర్, వరదరాజపురం, ఆదనూర్ తదితర ప్రాంతాల్లో చేపట్టిన వరద నివారణ పనుల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నా ఆధారాలు లేకపోవడంతో అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులు చర్యలు తీసుకోలేదు. నిఘా మాత్రం కొనసాగించారు. 2018 నుంచి 2021 వరకు కుజరాజ్ ఆదాయానికి మించి సుమారు రూ.3.38 కోట్ల మేరకు తన తల్లి తమిళరసి, ఈమె సహోదరి రాజేశ్వరి, రాజేశ్వరి కుమార్తె రాజలక్ష్మిలపై 145 శాతం మేరకు అక్రమాస్తులు కూడబెట్టినట్లు తేలింది. అనిశా అధికారులు వారందరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పెరుమాళ్ ఆలయంలో పాతాళగది


పాతాళగది నుంచి వస్తువులను బయటకు తీస్తున్న దృశ్యం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ సమీపం సీఎస్ఎన్ పాళ్యంలో వెయ్యేళ్ల పురాతనమైన శ్రీసౌక్యనాధర్ శ్రీవెంకటేశపెరుమాళ్ ఆలయం ఉంది. కుంభాభిషేకం నిర్వహణకు పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. ఆలయ ప్రాంగణంలోని వళ్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి సన్నిధి అర్ధ మంటపం వద్ద గ్రానైట్ రాళ్లు పరిచేందుకు పాతవి తొలగిస్తుండగా సొరంగంలాంటిది బయట పడింది. మేస్త్రీలు విషయాన్ని దేవాదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కడలూర్ జిల్లా దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ భరణీధరన్ ఉత్తర్వుల మేరకు పురావస్తు శాఖ సలహాదారు, జోన్ స్థపతి, ఆలయ నిర్వాహకులు సమక్షంలో ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. సుమారు 10 అడుగుల వెడల్పుతో పాతాళ గది ఉన్నట్లు గుర్తించారు. ఆలయానికి సొంతమైన విలువైన ఆభరణాలు, పంచలోహ విగ్రహాలను, ఇతర వస్తువులను భద్రపరచడానికి అప్పట్లో ఏర్పాటు చేసి ఉండొచ్చని తెలిసింది.

విడాకులు కోరే దంపతులను హాజరవ్వాలని బలవంతం చేయకూడదు: మద్రాసు హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: విడాకుల కేసుల్లో దంపతులను నేరుగా హాజరవ్వాలని బలవంతం చేయకూడదని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించి ఇవ్వొచ్చని కుటుంబ సంక్షేమ కోర్టుకు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అమెరికాలో ఉంటున్న తమిళనాడుకి చెందిన దంపతులు అభిప్రాయ భేదాల కారణంగా పరస్పరం విడాకులు కోరి చెన్నై కుటుంబ సంక్షేమకోర్టులో కేసు వేశారు. హాజరయ్యేందుకు వీసా పొందడంలో తలెత్తిన సమస్య కారణంగా చెన్నై రాలేకపోవడంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. అమెరికాలో ఉన్న ఇండియన్ ఎంబసీ నుంచి వీసీ ద్వారా హాజరవ్వలేదని వాంగ్మూలాల నమోదుకు చెన్నై కుటుంబ సంక్షేమ కోర్టు నిరాకరించింది. అమెరికాలో ఉంటున్న భార్య తరఫున మద్రాసు హైకోర్టులో దాఖలైన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ నిర్మల్‌కుమార్ విచారించారు. నేర కేసుల్లోనే సంబంధితులు నేరుగా హాజరవడం తప్పనిసరి అని, ఇతర కేసుల్లో ముఖ్యంగా విడాకుల కేసుల్లో వీసీ ద్వారా హాజరయ్యేందుకు అవకాశం ఇవ్వాలన్నారు.

అరప్పోర్ ఇయక్కానికి మంత్రి తరఫున నోటీసు

ప్యారిస్, న్యూస్‌టుడే: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు తనపై ఆరోపణలు చేసిన అరప్పోర్ ఇయక్కానికి మంత్రి రాజకన్నప్పన్ తరఫున లాయరు నోటీసు పంపారు. చెన్నైలో రూ.411 కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాన్ని మంత్రి రాజకన్నప్పన్, ఆయన కుమారులు ఆక్రమించినట్లు అరప్పోర్ ఇయక్కం ఆరోపణలు చేసింది. కేసు నమోదు చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరింది. కోర్టు ఉత్తర్వులను దాచి, పరువునష్టం కలిగించే సమాచారాన్ని తెలిపిన వారిపై కోర్టు చర్యలు చేపడుతుందని మంత్రి తరఫున వెల్లడించారు.

పునరుద్ధరణ పనులకు భూమిపూజ


ఇటుక అందిస్తున్న మంత్రి ఆర్.గాంధీ

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట పట్టణం వద్దనున్న దేసింగ్‌రాజా, రాణిబాయ్ జ్ఞాపకార్థం మండపాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని పునరుద్ధరించేందుకు రూ.2.50 కోట్లతో పనులు చేపట్టారు. బుధవారం రాష్ట్ర ఖద్దరు, జౌళి శాఖ మంత్రి ఆర్.గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ఇటుకను అందజేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు చంద్రకళ, ఆర్కాడు ఎమ్మెల్యే జేఎల్ ఈశ్వరప్పన్, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు


బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరాజన్

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: దేహదార్ఢ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే గోవిందరాజన్ అన్నారు. దివ్యాంగుల మధ్య సీఎం ట్రోఫీ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు గుమ్మిడిపూండిలో నిర్వహించారు. మొత్తం 80 మంది పాల్గొన్నారు. ఫైనల్లో తేర్వాయ్‌కండ్రిగకు చెందిన కరణ్‌పన్నీర్ విజయం సాధించాడు. అతనికి ఎమ్మెల్యే బుధవారం కప్పు అందజేసి మాట్లాడారు. డీఎంకే జిల్లా అధ్యక్షుడు పగలవన్, ఉప ప్రధాన కార్యదర్శి కదిరవన్, కోశాధికారి కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం


కుంభాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు కలెక్టరేట్‌ను ఆనుకుని పురాతన గురుమూర్తీశ్వరుడి ఆలయం ఉంది. ఈ క్షేత్రంలో బుధవారం కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, ధన పూజ, గణపతి హోమం, అభిషేక, ఆరాధనలు చేపట్టారు. వివిధ క్షేత్రాల నుంచి తీసుకువచ్చిన పవిత్ర జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి రాజగోపురంపై పురోహితులు భారీ క్రేన్ల సాయంతో అభిషేకించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

నాగాలమ్మ ఆలయంలో...

పెరియపాళ్యం, న్యూస్‌టుడే: పెరియపాళ్యం సమీప కన్నిగైప్పేరలోని 180 ఏళ్లనాటి నాగాలమ్మ ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. భక్తుల విరాళాలతో చేపట్టిన జీర్ణోద్ధారణ పూర్తవడంతో బుధవారం కుంభాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


చెన్నై సచివాలయంలో రాష్ట్ర పౌర సంబంధాలు, తమిళ అభివృద్ధి శాఖల మంత్రి సామినాథన్ నేతృత్వంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి చేసిన ప్రకటనలు, వాటి అమలు తీరు, పథకాల అమలు తీరుపై బుధవారం సమీక్ష నిర్వహించారు. సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. -వేళచ్చేరి, న్యూస్‌టుడే

మరుదు సోదరులకు నేడు ప్రభుత్వ నివాళి

చెన్నై, న్యూస్‌టుడే: బ్రిటీషువారికి శిస్తు చెల్లించడానికి నిరాకరించి పోరాడి ప్రాణాలు కోల్పోయిన మరుదు సోదరుల వర్ధంతి గురువారం జరగనుంది. గిండి గాంధీ మండపం ప్రాంగణంలోని వారి విగ్రహాలకు ఉదయం 9.30కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు నివాళులర్పించనున్నారు.

గర్భిణులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ


కిట్ అందిస్తున్న మేయర్ ప్రియ

చెన్నై, న్యూస్‌టుడే: గర్భిణులకు పౌష్టికాహార కిట్లను మహానగర చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ అందించారు. ఈశాన్య రుతుపవన వర్షాలు పురస్కరించుకుని తిరు.వి.క.నగర్ జోన్, 74వ డివిజన్‌లోని కృష్ణదాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన వర్షాకాల ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. గర్భిణులకు పౌష్టికాహార పదార్థాలు కలిగిన కిట్లను అందించారు. కార్యక్రమంలో జోనల్ కమిటీ ఛైర్మన్ సరిత మహేశ్‌కుమార్, నగర సంక్షేమ అధికారి డాక్టర్ జగదీశన్, జోనల్ అధికారి మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

వడపళని, న్యూస్‌టుడే: 'ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ)లో చేరేందుకు ఉత్తర చెన్నై వాసులకు ఈ నెల 30 వరకు గడువు తేదీని పొడిగించినట్లు చెన్నై కలెక్టరేట్ ఒక ప్రకటన విడుదల చేసింది. పది, ప్లస్‌టూ, డిగ్రీ చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి నెలా రూ.750 ఆర్థిక సాయం, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బస్ పాస్ అందజేస్తారు. కోర్సుకు ప్రత్యేకంగా ఫీజు ఉండదు.

పూండి చెరువుకు తగ్గిన నీటి విడుదల

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: కండలేరు జలాశయం నుంచి పూండి చెరువుకు నీటి విడుదలను తగ్గించారు. తెలుగు గంగ పథకం కింద సెప్టెంబరు 23 నుంచి నెల్లూరు సమీప కండలేరు జలాశయం నుంచి పూండి చెరువుకు నీటిని విడుదల చేస్తున్నారు. సెకనుకు 1100 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావంగా పూండి చెరువు పరివాహక ప్రాంతంలో అప్పుడప్పుడు వర్షాలు పడుతుండడంతో బుధవారం నీటిని 500 క్యూసెక్కులకు తగ్గించగా పూండి చెరువుకు 35 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రస్తుతం చెరువులో 489 మిలియన్ ఘనపుటడుగుల నీరు ఉండగా చెంబరంబాక్కం చెరువుకు 350 క్యూసెక్కులు, చెన్నై జలమండలికి 17 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నారు.

రౌడీ అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: కోర్టు ఆదేశాల మేరకు రౌడీని పోలీసులు అరెస్టు చేశారు. ఎన్నూర్‌కి చెందిన రౌడీ వీరరాఘవన్‌పై పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అరెస్టై జైల్లో ఉన్న ఆయన కొద్దిరోజుల కిందట బెయిల్‌పై బయటికొచ్చాడు. విచారణకు హాజరుకాకపోవడంతో కోర్టు అరెస్టు వారెంట్ జారీచేసింది. పోలీసులు అరెస్టు చేసి అతని నుంచి తుపాకీ, నాలుగు తూటాలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అరెస్టైన అప్పు తన స్నేహితుడని, ఇద్దరూ ఒడిశాలో తుపాకీ కొనుగోలు చేసినట్లు పేర్కొన్నాడు.


కొనసాగుతున్న పనులు

వల్లలార్ అంతర్జాతీయ కేంద్రం పనులు పునఃప్రారంభం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా వడలూర్‌లోని వల్లలార్ అంతర్జాతీయ కేంద్రం రెండో దశ పనులు పునఃప్రారంభమయ్యాయి. ఇక్కడ అరుళ్‌ప్రకాశ జ్ఞానసభలో ఏటా తైపూస జ్యోతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఆనవాయితీగా వస్తోంది. వడలూర్ మైదానంలో రూ.99.90 కోట్లతో వల్లలార్ అంతర్జాతీయ కేంద్రం నిర్మాణం చేపట్టగా ఇబ్బందులు ఎదురవుతాయని భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పార్వతీపురం గ్రామస్థులు కూడా నిరసనకు దిగారు. లోక్‌సభ ఎన్నికల కారణంగా నిర్మాణం ఆపేశారు. అనంతరం నిర్మాణాన్ని ఆక్షేపిస్తూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పలు అంశాలపై హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. ఆక్రమణలు తొలగించి, ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేయడంతో పనులు ప్రారంభించవచ్చని హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో పనులు తిరిగి మొదలుపెట్టారు. ఇక్కడ ఆసుపత్రి, వృద్ధాశ్రమం, వసతిగృహం ఏర్పాటు చేయనున్నారు.

వర్షాలతో నష్టం వాటిల్లకూడదు: జీకే వాసన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాల వర్షాలకు ప్రజలు, పశువులు, పంటలకు ఎలాంటి నష్టం వాట్లిలకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ బుధవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా చెన్నైలో ఏటా వచ్చే వరదలను చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారని తెలిపారు.


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల ఆందోళన

మహాబలిపురం, న్యూస్‌టుడే: న్యాయవాదులకు వ్యతిరేకంగా డీజీపీ విడుదల చేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉప సంహరించుకోవాలని చెంగల్పట్టు బార్ అసోసియేషన్ తరఫున బుధవారం డిమాండ్ చేశారు. డీజీపీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చెంగల్పట్టు కోర్టు ప్రాంగణంలో నినాదాలు చేశారు. ఆందోళనలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆనందీశ్వరన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పిల్లలను తమిళంలో మాట్లాడనివ్వండి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాష్ట్ర అసెంబ్లీలో ఆర్డినెన్స్‌లను తమిళంలో విడుదల చేయాలని అకారముడి ప్రాజెక్టు డైరెక్టరు ఆర్.మనోన్మణి విజ్ఞప్తి చేశారు. మంగళవారం చెన్నైలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నామక్కల్ కవి ముని మనవరాలు, వినియోగదారుల శాఖ డిప్యూటీ డైరెక్టరు ఆర్.మనోన్మణి పాల్గొని మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలు ఆంగ్లంలో మాట్లాడితే సంతోషిస్తున్నారన్నారు. భవిష్యత్తులో తమిళం నిలదొక్కుకోవాలంటే పిల్లల చేతుల్లోనే ఉందన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే తమిళ పదాలను పరిచయం చేయాలని సూచించారు. ఆర్డినెన్స్‌లు, శాసనాలు, కరపత్రాలు తమిళంలోనే ఉండాలన్నారు.

నృత్య ప్రదర్శన ప్రారంభం

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు సమీప కడంబత్తూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నృత్య ప్రదర్శన బుధవారం ప్రారంభమైంది. పంచాయతీ అధ్యక్షురాలు తమిళ్‌సెల్వి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జిల్లాలోని 300 పాఠశాలలకు చెందిన 1100 మంది విద్యార్థులు పాల్గొంటున్న ఈ పోటీలు 26 వరకు కొనసాగనున్నాయి. భరతనాట్యం, కథాకళితో పాటు వివిధ నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించనున్నారు. కార్యక్రమంలో బీడీవోలు రమేష్, మోహన్ పాల్గొన్నారు.

చౌక దుకాణ సిబ్బంది నిరవధిక సమ్మె

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు తాలూకాలో 63 చౌక దుకాణాలు, 12 ప్రాథమిక సహకార బ్యాంకులు, ఆర్‌కేపేట తాలూకాలో 58 చౌక దుకాణాలు, 11 ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో పనిచేస్తున్న సిబ్బంది తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలంటూ సమ్మె చేపట్టారు. చౌక దుకాణ సేల్స్‌మేన్‌ల వద్ద రెండింతలు అపరాధ రుసుము వసూలు రద్దు, కంట్రోల్ లేని వస్తువులను ఎక్కువగా దింపి విక్రయించాలని నిర్ణయించడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చౌక దుకాణ సిబ్బందిని వారి సొంత జిల్లాల్లో పనిచేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సిబ్బంది సమ్మెతో నిత్యావసర వస్తువులు కొనలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

26, 27 తేదీల్లో వరదరాజ పెరుమాళ్ ఆలయ వస్త్రాల వేలం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం వరదరాజ పెరుమాళ్ ఆలయంలో 26, 27 తేదీల్లో స్వామివారి వస్త్రాలను వేలం వేయనున్నట్లు అధికారులు బుధవారం ప్రకటనలో తెలిపారు. స్వామివారికి మొక్కు తీర్చుకొనేలా భక్తులు సమర్పించిన వస్త్రాలను రెండు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలోని వసంత మంటపంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేలం వేయనున్నామని పేర్కొన్నారు.



దర్యాప్తు చేస్తున్న అధికారులు

కవరైపేట్టై రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న దర్యాప్తు

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: గుమ్మిడిపూండి సమీపాన ఈనెల 11న కవరైపేట్టైలో లూప్‌లైన్‌లో ఆగిన గూడ్స్ రైలును భాగమతి ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 12 బోగీలు బోల్తా పడగా 19 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఘటనా స్థలాన్ని రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ కమిషనర్, ఉన్నతాధికారులు సందర్శించారు. ప్రమాదానికి గల కారణంపై దర్యాప్తు చేస్తున్నారు. కవరైపేట్టైలో స్టేషన్ మాస్టర్, సూపరింటెండెంటు, సిగ్నల్ మ్యాన్, గేట్ కీపర్ వద్ద మంగళవారం దర్యాప్తు చేపట్టారు. బుధవారం కూడా దర్యాప్తు కొనసాగింది. లూప్‌లైన్ వద్ద పట్టాల్లో బోల్టులు, నట్లు ఊడడంతో ప్రమాదం సంభవించిందని తేలడంతో కుట్ర కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నెల రోజుల క్రితం పొన్నేరి రైల్వేస్టేషన్ వద్ద ఇదే తరహాలో పట్టాలకు అమర్చిన బోల్టులు, నట్లు ఊడి ఉండడాన్ని లైన్ మ్యాన్ గుర్తించడంతో పెనుప్రమాదం తప్పింది. ఇక్కడి సిబ్బందిని సైతం అధికారులు విచారించారు.

విజయ్ సేతుపతి చిత్రానికి పూజ

చెన్నై, న్యూస్‌టుడే: విజయ్ సేతుపతి తదుపరి చిత్రానికి పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. నిత్యా మేనన్ నాయిక. యోగిబాబు ప్రధానపాత్ర పోషిస్తున్నారు. సత్యజ్యోతి ఫిలిమ్స్ పతాకంపై నిర్మించనున్నారు. చిత్రీకరణ తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్, మదురైలో చేపట్టాలని సెప్టెంబర్ రూపొందించారు. తూత్తుకుడిలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంతం వద్ద పూజ కార్యక్రమం నిర్వహించారు.


విజయ్ సేతుపతి, పాండిరాజ్

త్వరలో బన్ బటర్ జామ్ మొదటి సింగిల్

చెన్నై, న్యూస్‌టుడే: రాఘవ్ మిర్దత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బన్ బటర్ జామ్'. బిగ్‌బాస్ సీజన్ 5 విజేత రాజు జయమోహన్ కథానాయకుడిగా ఆధ్య ప్రసాద్, భవ్య త్రిఖ నాయికలుగా నటించారు. చార్లి, శరణ్య పొన్‌వణ్ణన్, దేవదర్శిని, మైకేల్, తంగదురై, విజే పప్పు తదితరులు ఇతర నటీనటులు. ఆఫ్ ఆల్‌స్ పతాకంపై రూపొందగా నివాస్ ప్రసన్న సంగీతం సమకూర్చారు. ఆడియో హక్కులను సోనీ మ్యూజిక్ పొందింది. తొలి సింగిల్‌ను త్వరలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రోమో వీడియోను విడుదల చేసి ప్రకటించింది.




సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, అధికారులు

అభివృద్ధి పథకాలపై ఉప ముఖ్యమంత్రి సమీక్ష

సైదాపేట, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ బుధవారం పలు పథకాలను సమీక్షించారు. తమిళనాడు మహిళాభివృద్ధి సంస్థ కింద పని చేసే రాష్ట్ర గ్రామీణ, పట్టణ జీవనోపాధి ఉద్యమం, జీవించి చూపిద్దాం, దీనదయాళన్ ఉపాధ్యాయ గ్రామీణ సామర్థ్య శిక్షణ పథకం వంటి పథకాల పనితీరుపై ఆయన తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేడీ, తమిళనాడు మహిళాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రేయా పి సింగ్, అదనపు సంచాలకులు, డిప్యూటీ సంచాలకులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


చిత్రం పోస్టరు

కాదలే కాదలే తొలి గీతం విడుదల నేడు

చెన్నై, న్యూస్‌టుడే: వర్ధమాన దర్శకుడు ఆర్.ప్రేమ్‌నాథ్ దర్శకత్వంలో మహత్ రాఘవేంద్ర, మీనాక్షి జయింగా నటిస్తున్న చిత్రం 'కాదలే కాదలే'. భారతిరాజా, వీటీవీ గణేశ్, రవీనా, పుగళ్, నాజర్ తదితరులు ఇతర నటీనటులు. శ్రీవారి ఫిల్మ్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూర్చారు. తొలి సింగిల్ ప్రోమో వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటను వియన్ పుగళేంది రాయగా కపిల్ కబిలన్ ఆలపించారు. పాటను గురువారం సాయంత్రం 5 గంటలకు విడుదల చేయనున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

ఎన్నిసార్లు చూసినా ఆసక్తి తగ్గలేదు

చెన్నై, న్యూస్‌టుడే: దర్శకుడు శివ, నటుడు సూర్య కాంబినేషన్‌లో రూపొందిన 'కంగువా' నవంబరులో విడుదల కానున్న విషయం తెలిసిందే. గేయ రచయిత మదన్ కార్కి చిత్రంపై తన అభిప్రాయాలను 'ఎక్స్' పేజీలో పంచుకున్నారు. 'కంగువా' చిత్రాన్ని పూర్తిగా చూశాను. డబ్బింగ్ సమయంలో వందసార్లకు పైగా చూశాను. చిత్రంపై ఆసక్తి కొంచెం కూడా తగ్గలేదు. చూసే ప్రతిసారి మరింత ఆసక్తి పెరిగింది. సన్నివేశాలు బ్రహ్మాండంగా వచ్చాయి. కథ, సంగీతం అద్భుతంగా ఉన్నాయి. సూర్య నటన వేరే స్థాయిలో ఉంది. దర్శకుడు సిరుత్తై శివ రూపొందించిన అద్భుత అనుభవానికి, ఆయన కలలు సాకారం చేసిన స్టూడియో గ్రీన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.


మదన్ కార్కి


అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో ధర్మపుర ఆధీనం మాసిలామణి దేశిగజ్ఞానసంబంధ స్వాములు

ధర్మపుర ఆధీనం స్వామి దర్శనం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయానికి బుధవారం ధర్మపుర ఆధీనం మాసిలామణి దేశిక జ్ఞానసంబంధ స్వాములు విచ్చేశారు. ఆయనకు ఆలయం తరఫున వేదపండితులు ఆహ్వానం పలికారు. ఆలయంలో స్వామి, అమ్మవారి సన్నిధి, ఇతర సన్నిధులకు వెళ్లి దర్శనం చేసుకున్నారు. ఆయనకు వేదపండితులు ఆలయం తరఫున ప్రసాదాలు అందజేశారు.



మాట్లాడుతున్న కాందంబరి

వీఐటీలో ముగిసిన సదస్సు

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ వీఐటీ విశ్వవిద్యాలయంలో ఉద్యోగ కల్పనా విభాగం, బయోసైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం సంయుక్తంగా వాయిస్ ఫర్ బీటీ- బయోటెక్నాలజీ పేరిట జాతీయ సదస్సు రెండు రోజులు పాటు నిర్వహించారు. దక్షిణ భారతదేశంలోని 24 ప్రముఖ కళాశాలలకు చెందిన 41 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించగా విశ్వవిద్యాలయ ఉప ఛైర్‌పర్సన్ కాదంబరి అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. బయోటెక్నాలజీ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు తగ్గట్లు విద్యార్థులు సిద్ధమవ్వాలని సూచించారు. వర్సిటీ జాయింట్ కులపతి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



రెస్టారెంట్‌లో ఆంధ్రా టిఫిన్ రూమ్

చెన్నైలో అమరావతి రుచులు

టీనగర్, న్యూస్‌టుడే: చెన్నై గోపాలపురం కెథడ్రల్ రోడ్డులోని అమరావతి రెస్టారెంట్‌లో కొత్తగా ఆంధ్రా టిఫిన్ రూమ్ బుధవారం ప్రారంభమైంది. సంస్థ డైరెక్టర్లు నీనారెడ్డి, నివృతి తదితరులు పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అమరావతి రెస్టారెంట్ గోపాలపురంతోపాటు ఈసీఆర్ రోడ్డులోనూ కొనసాగుతోందన్నారు. నెయ్యితో ఎర్రకారం దోసె, ఇడ్లీలకు అల్లం చట్నీ, వేరుశెనగల పచ్చడితోపాటు ఇంకా అనేక రకాల చట్నీలను ఎప్పటికప్పుడు తయారు చేసి అందిస్తున్నట్లు తెలిపారు. తమ రెస్టారెంట్‌లో పూతరేకులు, ఎమ్మెల్యే పెసరట్టు, బాదంపాలు ప్రత్యేకమన్నారు.

ప్రజాప్రతినిధుల డిమాండ్లు నెరవేర్చాలి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: ప్రజా ప్రతినిధుల డిమాండ్లు నెరవేర్చేలా అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించాలని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం కోరారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినప్పుడు వారికి ప్రాధాన్యం ఇచ్చి, డిమాండ్లు అడిగి తెలుసుకుని, చట్టానికి అనుగుణంగా చర్యలు తీసుకోవటం ఆనవాయితీ అన్నారు. ఇది స్థానిక ప్రతినిధులకు కూడా వర్తిస్తుందని, ఇందుకు పూర్తి భిన్నంగా రాష్ట్రంలో పరిస్థితులు ఉన్నాయన్నారు.

ఈపీఎస్ స్నేహితుడి కళాశాలలో ఐటీ దాడులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి ఎడప్పాడి పళనిసామి సన్నిహిత స్నేహితుడు ఆర్ ఇళంగోవన్ గతంలో సేలం సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్‌గా ఉండేవారు. ప్రస్తుతం సేలం నగర జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరికి సొంతంగా తిరుచ్చి ముసిరి ప్రాంతంలో కళాశాల ఉంది. బుధవారం కళాశాలలో ఆదాయ పన్నుశాఖ అధికారులు సోదాలు జరిపారు. ఇళంగోవన్ ఆదాయానికి మించి రూ.3.78 కోట్లు ఆస్తులు కూడబెట్టినట్లు అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది.

ఘనవ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టు పనులు ప్రారంభం

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా ఆర్కాడు పంచాయతీ యూనియన్‌కు చెందిన 25 గ్రామాల్లోని చెత్తకుప్పలను(ఘన వ్యర్థాలను)తరలించేందుకు రూ.63.50 లక్షల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు పనులకు అవసరమైన 25 ఎలక్ట్రిక్ వాహనాల తాళాలను రాష్ట్ర ఖద్దరు, జౌళి శాఖ మంత్రి ఆర్.గాంధీ పారిశుద్ధ్య కార్మికులకు అందజేశారు. వేపూరు గ్రామంలో రూ.14 లక్షల వ్యయంతో నూతన అంగన్‌వాడి కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు చంద్రకళ, జిల్లా పథకాల అమలు అధికారిణి జయసుధ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి తాళాన్ని అందజేస్తున్న ఆర్.గాంధీ →





సోదాల నేపథ్యంలో కార్యాలయ తలుపులు మూసివేసిన దృశ్యం

సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో అనిశా సోదాలు

అరక్కోణం, న్యూస్‌టుడే: అరక్కోణం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం జిల్లా అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ గణేశన్ నేతృత్వంలో బుధవారం సాయంత్రం సోదాలు జరిపారు. లోపలివారు బయటకు రాకుండా, బయటివారు లోనికి వెళ్లకుండా తలుపులు మూసేశారు. లెక్కల్లోకి రాని నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

ఇలాంటి కథ సినిమాల్లోనూ చూడలేదు

మద్రాసు హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: మహిళను కిడ్నాప్ చేసి, హత్య చేసిన కేసును విచారించిన హైకోర్టు.. ఇలాంటి కథ సినిమాల్లో కూడా చూడలేదని తెలిపింది. చెన్నై వడపళనికి చెందిన కామాక్షి అనే మహిళను కొందరు రౌడీలు కిడ్నాప్ చేసి ఊత్తుకోట వద్ద హత్య చేసినట్లు హైకోర్టు లాయరు సోమవారం ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనంలో విన్నవించారు. అనంతరం హైకోర్టు సుమోటోగా విచారణకు తీసుకుంది. బుధవారం ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనంలో విచారణకు వచ్చింది. చీఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హసన్ మొహ్మద్ జిన్నా.. పోలీసులు జరిపిన ప్రాథమిక దర్యాప్తులో ఇలాంటి హత్య జరగలేదని తెలిసిందని, తప్పుడు ఫిర్యాదు అన్నారు. ఈ విషయమై కోర్టులో విన్నవించిన లాయరుకి, మరో మహిళకు మధ్య నగదు ఇచ్చి పుచ్చుకునే వ్యవహారమై గొడవ ఉందని అందుకే ఆ మహిళ చెప్పిన విషయాన్ని నిజమని నమ్మి హైకోర్టులో విన్నవించారన్నారు. కేసు విచారించిన న్యాయమూర్తులు...ఇలాంటి కథ సినిమాల్లో కూడా చూడలేదని, ఆ మహిళకు సంబంధించిన సమాచారం ముందుగానే కోర్టులో ఎందుకు చెప్పలేదని లాయరుని ప్రశ్నించారు. సుమోటోగా విచారణకు తీసుకున్న కేసుని ముగించేస్తూ, ఇలాంటి వ్యవహారాల్లో అప్రమత్తంగా ఉండాలని లాయరుకు హెచ్చరికలు చేశారు.


వినతి పత్రాలతో ఆటోవాలాలు

ర్యాపిడో, ఓలా వాహనాలను నిషేధించాలి

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ ఎస్పీ మదివాణన్ వద్ద హిందూ ఆటో డ్రైవర్ల సంఘ సభ్యులు బుధవారం కలిసి వినతి అందజేశారు. ర్యాపిడో, ఓలా, ఉబెర్ లాంటి కార్పొరేట్ సంస్థలు ద్విచక్ర వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లడంతో తాము నష్టపోతున్నామని ఆరోపించారు. మోటార్ వాహన చట్టం మేరకు ద్విచక్ర వాహనాలను వ్యక్తిగత కారణాలకు మాత్రం వినియోగించాలని, వర్తకానికి కాదని స్పష్టం చేస్తోందని గుర్తు చేశారు. కావున ర్యాపిడో, ఓలా వాహనాలకు నిషేధం విధించాలని కోరారు.

పింక్ ఆటో పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నైలో నివసించే మహిళల భద్రత కోసం పింక్ ఆటో పథకాన్ని ప్రవేశపెడుతున్నామని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. మహిళా ఆటో డ్రైవర్ల ద్వారా 250 ఆటోలను చెన్నై కార్పొరేషన్‌లో పరిచయం చేయనున్నారు. అత్యవసర సమయాల్లో ఫిర్యాదు పొందిన వెంటనే పోలీసుశాఖ ద్వారా త్వరితగతిన చర్యలు తీసుకునేలా ఆటోల్లో పోలీసుశాఖ హెల్ప్‌లైన్‌తో జీపీఎస్ ఏర్పాటు చేయనున్నారు. 10వ తరగతి చదివిన, డ్రైవింగ్ లైసెన్సు ఉన్న 25 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం పేర్కొంది. ఆటో కొనుగోలుకు ప్రభుత్వం రాయితీ అందించనుంది.



జాతీయ జల అవార్డు గ్రహీతలకు అభినందన

విల్లివాక్కం, న్యూస్‌టుడే: తిరుచ్చి జోన్, పుదుక్కోట్టై జిల్లా సౌత్ వెల్లారు కాలువ డివిజన్ పెరంబూర్ పెద్ద కాలువ నీటి వినియోగదారుల సంఘం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నుంచి జాతీయ జల అవార్డు-23ను దిల్లీలో అందుకుంది. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర సచివాలయంలో జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్‌కు చూపి అభినందనలు అందుకున్నారు. జలవనరుల శాఖ ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శి డాక్టర్ మణివాసగన్, సంఘ అధ్యక్షుడు పొన్నయ్య, పళనిసామి తదితరులు పాల్గొన్నారు.


అవార్డును మంత్రికి చూపుతున్న దృశ్యం


నందంబాక్కం చెన్నై ట్రేడ్ సెంటర్‌లో పవన విద్యుత్తు ప్రదర్శనను బుధవారం జీడబ్ల్యూఈసీ ఇండియా ఛైర్‌పర్సన్ గిరీష్ తంటి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. చిత్రంలో తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టరు అనీష్ శేఖర్ తదితరులు ఉన్నారు. -న్యూస్‌టుడే, వడపళని

పుదుచ్చేరి సీఎం కార్యాలయ సిఫార్సు లేఖతో..

బ్లాక్‌లో శ్రీవారి దర్శన టికెట్ల విక్రయం

కేసు నమోదు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శన టికెట్‌ను భక్తులకు అధిక ధరలకు విక్రయించిన దళారిపై తిరుమల వన్‌టౌన్ పీఎస్ పోలీసులు కేసును నమోదు చేశారు. తితిదే విజిలెన్స్ వింగ్ అధికారుల వివరాల మేరకు.. పుదుచ్చేరి రాష్ట్రానికి చెందిన పద్మనాభన్ అక్కడి సీఎం కార్యాలయం నుంచి శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనానికి తన పేరుతో సిఫారసు లేఖను తీసుకున్నాడు. అనంతరం సదరు లేఖలో తనతోపాటు నెల్లూరుకు చెందిన ఐదుగురు భక్తులను శ్రీవారి దర్శనానికి తీసుకెళతానని చెప్పి రూ.23 వేలు వసూలు చేశాడు. ఈక్రమంలో భక్తులు తమ వద్ద దర్శనం కోసం అధిక నగదు వసూలు చేసినట్లు తితిదే విజిలెన్స్ వింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి విచారణలో వాస్తవమని తేలడంతో తిరుమల వన్‌టౌన్ పీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


నిరసన తెలుపుతున్న అన్నాడీఎంకే కౌన్సిలర్లు

కోవై కార్పొరేషన్ సమావేశం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరు కార్పొరేషన్ కార్పొరేటర్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆస్తి పన్నును చదరపు అడుగుకు రూ.82 పెంచాలని తీర్మానం ప్రవేశ పెట్టారు. ఇందుకు నిరసనగా అన్నాడీఎంకే కార్పొరేటర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. సమావేశ హాల్ బయట తలపై రుమాళ్లు కప్పుకొని నిరసన తెలిపారు.

ధరలు ఎందుకు పెరిగాయి?

గాయత్రి రఘురామ్

సైదాపేట, న్యూస్‌టుడే: కోట్లాది రూపాయలు అప్పు చేసినా ధరలు ఎందుకు పెరిగాయని అన్నాడీఎంకే మహిళా విభాగం ఉప కార్యదర్శి గాయత్రి రఘురామ్ ప్రశ్నించారు. అన్నాడీఎంకే 53వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నై తండయార్‌పేటలో ప్రజలకు సంక్షేమాలు అందించే కార్యక్రమం జరిగింది. పార్టీ ఉత్తర చెన్నై తూర్పు జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ రాజేష్ నేతృత్వం వహించారు. గాయత్రి రఘురామ్ మాట్లాడుతూ డీఎంకే అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో రూ.3.5 లక్షల కోట్ల రుణం తీసుకుందన్నారు. ఇంత అప్పు చేసిన తర్వాత కూడా ధరలు ఎందుకు పెరిగాయని ప్రశ్నించారు.


నాట్లు వేస్తున్న మహిళలు

రోడ్డుపై నాట్లు వేసిన మహిళల నిరసన

పొన్నేరి, న్యూస్‌టుడే: మీంజూరు సమీప నాలూరు-కమ్మవారు పాళ్యం మధ్య ఉన్న రోడ్డు ఆ ప్రాంతంలోని కర్మాగారాలకు భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు దెబ్బతింది. దీనికి తోడు మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురవడంతో రోడ్డులో మోకాళ్ల లోతుకు గుంతలు ఏర్పడడంతో పాదచారులు సైతం వెళ్లలేని స్థితి ఏర్పడింది. రోడ్డును బాగు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన మహిళలు గతుకుల రోడ్డులో బుధవారం నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. వారం రోజుల్లో రోడ్డును బాగు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో శాంతించారు.

పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర నిందితుడు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర నిందితుడ్ని శ్రీకాళహస్తి పట్టణ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ చోరీకి సంబంధించిన వివరాలను డీఎస్పీ కె.నరసింహమూర్తి ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన భరద్వాజన్ ప్రేమ్‌కుమార్ అలియాస్ కుమార్(30) తమిళనాడు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు చోరీ కేసుల్లో నిందితుడు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద బుధవారం మధ్యాహ్నం పోలీసులను చూసి పరిగెత్తడంతో అదుపులోకి తీసుకున్నారు. సుమారు రూ.20 లక్షలు విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో 220 గ్రాముల బంగారు ఆభరణాలు, 2,180 కిలోల వెండి దీపపు స్తంభాలు, చెంబులతో పాటు చోరీలకు పాల్పడే రాడ్‌ను, ల్యాప్‌టాప్‌ను, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తుతో క్రికెట్ బెట్టింగులు పెడుతున్నట్లు గుర్తించారు.

కోవైలో భారీ వర్షం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరు జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జనజీవనం స్తంభించింది. మేట్టుపాళ్యం సమీప పెరియనాయక్కన్‌పాళ్యం వద్ద ఉన్న వంతెన కింద భాగంలో సుమారు 15 అడుగుల నీరు నిలిచిపోయింది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న రెండు కార్లు ప్రవాహంలో చిక్కుకున్నాయి. అదృష్టవశాత్తు కార్లలోని ఐదుగురు ప్రాణాలతో బయట పడ్డారు.


ప్రవాహంలో చిక్కుకున్న కార్లు

చెక్‌పోస్టులో తనిఖీ

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ జిల్లా కాట్పాడి సమీపంలోని క్రిస్టియన్‌పేట చెక్‌పోస్టులో సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నారని అనిశా అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు సదరు శాఖ డీఎస్పీ శంకర్, సీఐ మైథిలితో కూడిన బృందం బుధవారం వేకువజామున ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విధుల్లో ఉన్న ఆర్‌టీఐ జయంతి, సిబ్బంది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. లెక్కలోకి రాని రూ.1.39 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. జయంతి, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు చేపడుతామని డీఎస్పీ శంకర్ తెలిపారు.

మాజీ మంత్రి వైద్యలింగం ఇంట్లో ఈడీ సోదాలు

ప్యారిస్, న్యూస్‌టుడే: మాజీ మంత్రి వైద్యలింగం ఇంట్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోదాలు చేపట్టింది. వైద్యలింగం 2011-16 అన్నాడీఎంకే హయాంలో గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. 2016లో చెన్నై పెరుంగళత్తూర్‌లో ఓ ప్రైవేటు సంస్థ నిర్మాణ పనులకు రూ.27.90 కోట్లు లంచం తీసుకున్నట్లు అరప్పోర్ ఇయక్కం అవినీతి నిరోధక శాఖ(అనిశా)కు ఫిర్యాదు చేసింది. వైద్యలింగం, ఆయన కమారులు ప్రభు, షణ్ముగప్రభు, ప్రైవేటు సంస్థలకు చెందిన పన్నీర్‌సెల్వం, రమేష్ తదితర 11 మందిపై అనిశా కేసు నమోదు చేసింది. ఈ కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈడీ అధికారులు బుధవారం వైద్యలింగానికి చెందిన చెన్నై, ఓరత్తనాడు తదితర పలు ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు.

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్ జిల్లా పళనిలోని ముల్లైనగర్ ప్రాంతానికి చెందిన ఇళంగుమరన్ తన కుటుంబంతో నివసిస్తున్నాడు. ఇతని భార్య ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా కుమారుడు కోవైలోని ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. కుమార్తె 12వ తరగతి చదువుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం కుమారుడు తన ఇంటికి ఫోన్ చేశాడు. ఎవరూ ఫోన్ తీయకపోవడంతో పక్కనే ఉంటున్న స్నేహితుడికి ఫోన్ చేసి ఇంటికి వెళ్లి చూడమని చెప్పాడు. అప్పుడు ఇంటి వద్దకు వెళ్లి తలుపులు తట్టినా ఎవరూ వచ్చి తెరవలేదు. తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఇళంగుమరన్ ఉరికి వేలాడుతుండగా, వారి భార్య, కుమార్తె విషం తాగి నేలపై విగతజీవులుగా పడి ఉన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి ఆత్మహత్యకు గల కారణాలు గురించి విచారణ చేపట్టారు.

తల్లీ కుమారుడు..

ప్యారిస్, న్యూస్‌టుడే: తూత్తుక్కుడి జిల్లా శ్రీ వైకుంఠం వద్ద ఉన్న ఆదిచ్చనల్లూర్‌కు చెందిన ముత్తమ్మాళ్(65) కుమారుడు చిన్నదురై(30) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో వారి ఇంటి తలుపులు మంగళవారం తెరుచుకోకపోవడంతో స్థానికులు వెళ్లి తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా రాకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా తల్లీ, కుమారుడు ఉరి వేసుకుని మృతి చెంది కనిపించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రాథమిక దర్యాప్తులో అప్పుల కారణంగా వారు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. కేసు దర్యాప్తులో ఉంది.

రహదారి ప్రమాదంలో యువకుడి మృతి

శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే: కాంచీపురానికి చెందిన గిరిధరన్(19) శ్రీపెరుంబుదూర్ సమీపంలోని ఓ ప్రైవేటు ట్రావెల్స్‌లో ఫోర్డు సంస్థలో టాటా ఏస్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి డ్యూటీ ముగించుకొని ద్విచక్ర వాహనంపై కాంచీపురానికి బయల్దేరాడు. చెన్నై-బెంగళూర్ జాతీయ రహదారిలో సత్యం గ్రాండ్ హోటల్ వద్ద వెనుక నుంచి కంటైనర్ లారీ గిరిధరన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీపెరుంబుదూర్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

టీఎన్‌ఈబీ ఉద్యోగి..

పొన్నేరి, న్యూస్‌టుడే: మీంజూరు సమీప దేవదానం మేట్టుకాలనీకి చెందిన బాలు (54) టీఎన్‌ఈబీలో లైన్‌మ్యాన్‌గా పని చేస్తున్నాడు. ఇతను విధులు ముగించుకుని మంగళవారం సాయంత్రం మణలి ఎక్స్‌ప్రెస్ రోడ్డును దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అతనిని బంధువులు చెన్నై స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రెడ్‌హిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో..

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప కడంబత్తూరు వైశాలి నగర్‌కు చెందిన దినేష్ (26) ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఇతను ఈనెల 16న విధులకు వెళ్లి రాత్రికి ఇంటికి చేరుకోలేదు. బంధువులు పలు చోట్ల వెతికినా కనిపించకపోవడంతో పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అతని మృతదేహం పనపాక్కంలోని చెరువులో బుధవారం తేలుతుండడంతో పశువుల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


దినేష్ (పాతచిత్రం)

రైతు బలవన్మరణం

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: గుమ్మిడిపూండి సమీప ఆత్తుపాక్కానికి చెందిన రఘు (35) రైతు. ఇతను పలువురి వద్ద అప్పు తీశాడు. తిరిగి చెల్లించపోవడంతో రుణదాతలు నిలదీశారు. దీంతో మనస్తాపం చెంది క్రిమిసంహారక మందు తాగాడు. అతస్మారక స్థితికి చేరడంతో బంధువులు చెన్నై స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు పేరుతో దోపిడీ: వ్యక్తి అరెస్టు

పొన్నేరి, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముబారక్‌నగర్‌కు చెందిన ప్రజేష్‌యాదవ్ లారీ డ్రైవర్. ఇతను సరకుల లోడ్డుతో మీంజూరు ఔటర్ రింగ్ రోడ్డులో మంగళవారం రాత్రి వెళ్తుండగా ఓ వ్యక్తి వాహనాన్ని ఆపి తాను పోలీసునని పరిచయం చేసుకున్నాడు. అధిక భారంతో వెళ్తుండడంతో రూ.10 వేల జరిమానా కట్టాలని బెదిరించాడు. అంత మొత్తం తన వద్ద లేదని డ్రైవర్ చెప్పడంతో దాడి చేసి రూ.3 వేలను లాక్కొని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మీంజూరు పోలీసులు దర్యాప్తు చేపట్టి జవహర్‌నగర్‌కు చెందిన మూర్తి అనే వ్యక్తిని బుధవారం అరెస్టు చేశారు.